# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తిరుమల బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీటీడీ అధికారులు ఈరోజు ఆహ్వానించారు.
- ❖ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం కల్తీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు.
- ❖ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజులు పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

========================

తిరుమలలో అక్టోబరు 4వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈరోజు ఆహ్వానించింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ముఖ్యమంత్రికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందించి.. బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు చంద్రబాబు నాయుడికు ఆశీర్వచనం ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ అధికారులకు, పండితులకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

========================

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం కల్తీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ కోరారు. కోట్లాది మందిభక్తులు మహాప్రసాదంగా స్వీకరించే లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటంపై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ.. ఈరోజు ఉపముఖ్యమంత్రి గుంటూరు జిల్లా నంబూరులోని

దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించారు. 11 రోజుల పాటు ఆయన దీక్ష కొనసాగించనున్నారు. దీక్ష చేపట్టిన అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ప్రసాదాల కల్తీ, నాణ్యత లేమి గురించి గతంలోనే చెప్పామని అన్నారు. ఇదే అంశంపై మంత్రి వర్గ సమావేశం, అసెంబ్లీలో చర్చ జరగాలని పవన్ కల్యాణ్ అన్నారు.

========================

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజులు పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం పై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఆకాశవాణికి తెలియజేశారు. మోడీ 3.0 ప్రభుత్వం మొదటి 100 రోజులు వికసిత్ భారత్-2047కి సంబంధించిన కీలక కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు స్థానిక ప్రజలు వివరించారు. ఈ 100 రోజుల్లో వివిధ రంగాల్లో ముఖ్యంగా వ్యవసాయం, మౌలిక సదుపాయాలపై 15 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. పేద, మధ్య తరగతి, అట్టడుగు వర్గాలకు జీవన సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో.. సాంకేతికత ద్వారా సులభతర వ్యాపార నిర్వహణను ప్రోత్సహించడంతో పాటు, పాలనా మెరుగుదలపై మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వారు వెల్లడిస్తూ...

(వాయిస్ 18 సెకన్లు)

========================

రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కొత్తపల్లి గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" పేరిట ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని, రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. 6 పథకాలలో భాగంగా దీపావళి రోజున ఉచిత గ్యాస్ పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వంద రోజుల్లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో సంక్షేమ పాలన అందించామన్నారు. టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళిలలో, త్వరలో ప్రభుత్వం "అన్న క్యాంటీన్లు" ప్రారంభిస్తామన్నారు. ప్రజల భూ ఆస్తులకు భద్రత కల్పించె విధంగా త్వరలో రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు. ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

విరామం

========================

రాయలసీమను రతనాలసీమగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈరోజు అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వద్ద పంప్ హౌస్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయలసీమకు సాగు, తాగు నీరు కోసం బడ్జెట్ లో 9 శాతం నిధులు కేటాయించారన్నారు. రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రిజర్వాయర్లలో నీటిని సంవృద్ధిగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని అన్నారు. హంద్రీనీవా కాల్వ వెడల్పును వచ్చే సీజన్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

========================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు

అనేక చోట్ల కురిసే అవకాశము ఎక్కువగా ఉందని, అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముంది. రానున్న మూడు, నాలుగు రోజులు రాష్ట్రంలో పలు జిల్లాలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని భారత వాతావరణ శాఖ సూచన చేసింది.

=========================

సిద్ధాంతాలే ముఖ్యంగా పని చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈరోజు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేదలు, తాడిత, పీడిత ప్రజల అభివృద్ధి కోసం ఆయన జీవితాంతం కృషి చేశారన్నారు. ఆయనతో నేరుగా అనుబంధం లేకపోయినా ఆయన గొప్పతనం గురించి ఎంతో విన్నానని తెలిపారు. అంతటి గొప్పవ్యక్తి తెలుగువారు కావడం గర్వకారణమన్నారు. రాష్ట్ర విభజన అనివార్యమైన తర్వాత అవకాశం వచ్చిన ప్రతిచోటా తెలుగు రాష్ట్రాలకు అందాల్సిన వాటి గురించి తన గళాన్ని బలంగా వినిపించారన్నారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం వినిపించారని, సీతారాం ఏచూరి జీవితం ఈ తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

=========================

ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26న ఈ పథకానికి సంబంధించి జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవగాహన సదస్సు లో ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు విధానం, సబ్సిడీ, అర్హత గల యూనిట్ల వివరాలు సంబంధింత అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు అవగాహన సదస్సులో పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోగలరని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

=========================

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ లో 5 డి-థియేటర్ ను ప్రారంభించనున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష చేపట్టిన కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీ ఉదయం సీతంపేట మండలం అడవిలో వ్యూ పాయింట్ తో పాటు, టెంటెడ్ అకామడేషన్, రెస్టారెంట్ ప్రారంభిస్తామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని గిరిజన సంస్కృతి, పార్వతీపురం మన్యం జిల్లా పర్యాటక అభివృద్ధికి సూచకగా వివిధ కళారూపాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు.

=========================
=========================